క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: మండలంలోని యనమలకుదురులో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి.హరిబాబు గురువారం తెలిపారు. యనమలకుదురు సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని తెలిపారు. ఇందిరానగర్ 1,2 ప్రాంతాలు, జన్మభూమి వంతెన రోడ్డు, తాడిగడప డొంక రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆపన్నులకు అండగా రాచూరి ఫౌండేషన్

కంకిపాడు: ఆపన్నులకు అండగా రాచూరి ఫౌండేషన్ నిలుస్తోందని ఫౌండేషన్ చైర్మన్, కంకిపాడు ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి అన్నారు. పట్టణానికి చెందిన శ్రీపాటి దుర్గమ్మ (80) అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం బాధిత కుటుంబానికి మట్టి ఖర్చులు నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని ఫౌండేషన్ నుంచి అందించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బాకీ వేణు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై కేసు

పెనమలూరు: మద్యం తాగి నిర్లక్ష్యంగా ఆటో నడిపి ప్రమాదం చేసిన డ్రైవర్‌పై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. పెనమలూరు పల్లిపేటకు చెందిన ఎస్.నాగరాజు ఆటోడ్రైవర్‌గా జీవిస్తున్నాడు. అతను బుధవారం మద్యం తాగి ఆటోలో పెనమలూరు నుంచి విజయవాడకు బయలుదేరాడు. పోరంకి పచ్చళ్ల కంపెనీ వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ సిటీ బస్సును వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మునిసిపల్ కార్మికులకు దుప్పట్ల పంపిణీ



పెనమలూరు: మండలంలోని పోరంకిలో మునిసిపల్ కార్మికులకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. వల్లూరుపల్లి నవరత్నం కేశవరావు ట్రస్టు, ప్రభునగర్ క్రీస్తు సేవాశ్రమం ఆధ్వర్యంలో 90 మంది కార్మికులకు దుప్పట్లు, రగ్గులను వైఎస్సార్ సీపీ నాయకుడు అంకెం రాజేష్ పంపిణీ చేశారు. మునిసిపల్ కార్మికుల సంక్షేమానికి వల్లూరుపల్లి ట్రస్టు ముందుకు వచ్చి సాయం అందించిందని రాజేష్ తెలిపారు.

అత్తింటి వారిపై కట్నం వేధింపుల కేసు

పెనమలూరు: అదనపు కట్నం కోసం వేధిస్తున్న ఓ అత్తింటివారిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. మండలంలోని వణుకూరుకు చెందిన నందేటి స్వాతికి కొద్ది సంవత్సరాల క్రితం సుబ్బారావుతో వివాహమైంది. పెళ్లి సందర్భంగా సుబ్బారావుకు అత్తింటివారు కట్నకానుకలు ఇచ్చారు. స్వాతి, సుబ్బారావు దంపతులకు ఇద్దరు పిల్లలు. అదనపు కట్నం తీసుకురావాలంటూ సుబ్బారావు భార్యను వేధించాగాడు. భర్తతో పాటు అత్త అన్నమ్మ, బావ మోహన్‌రావు కూడా అదనపు కట్నం కోసం వేధిస్తుండటంతో స్వాతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వేదవ్యాస దేవస్థానానికి విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: పల్నాడు జిల్లాలోని వైకుంఠపురం గ్రామంలో భవఘ్ని ఆరామం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న భగవాన్ వేదవ్యాస దేవస్థానానికి హనుమాన్‌జంక్షన్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ రూ.25 వేలు విరాళాన్ని అందించారు. ఈ మొత్తాన్ని భవఘ్ని ఆరామం ప్రతినిధులకు గురువారం ఆయన కార్యాలయంలో అందజేశారు. దేశంలో అతిపెద్ద వ్యాస మహర్షి ధర్మక్షేత్రాన్ని వైకుంఠపురంలో భవఘ్ని ఆరామం నిర్మించటం హర్షణీయమని పుట్టగుంట అన్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



పెనమలూరు: మండల పరిధిలో ఖాళీగా ఉన్న గ్రామ/వార్డు వలంటీర్ పోస్టుల భర్తీకి గురువారం ఇంటర్వ్యూలు జరిగాయి. పెనమలూరు మండలం నాలుగు, తాడిగడప మునిసిపాలిటీలో 28 వలంటీర్‌ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 46 మంది అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. పెనమలూరులో ఎంపీడీఓ సునితశర్మ, పోరంకిలో మునిసిపల్ కమిషనర్ ప్రకాశరావు అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేసి, ఎంపిన వారికి నియామక పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన పేరంటాలమ్మ ఉత్సవాలు

రామవరప్పాడు: స్థానిక శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో వారం రోజులుగా జరుగుతున్న సంక్రాంతి ఉత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. ఐదు రోజులుగా రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో అమ్మవారి గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రసాదంపాడులో రథోత్సవం ముగింపు అనంతరం ఆలయం ఎదుట అమ్మవారి విగ్రహాలు చేరుకున్నాయి.

కనుల పండువగా తెప్పోత్సవం


గ్రామంలోని నూతన వంతెన సమీపంలోని రైవస్ కాలువలో హంస ఆకారంలో ప్రత్యేకంగా అలంకరించిన పడవలో అమ్మవార్లను ఉంచి తెప్పోత్సవాన్ని నిర్వహించారు. ఏటా ఆనవాయితీ ప్రకారం నిర్వహించే తెప్పోత్సవాన్ని తిలకించేందుకు గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం సమీపంలోని రావిచెట్టు ఎదుట ఇరు గ్రామ పెద్దలు, భక్తులు కలిసి రకరకాల పుష్పాలతో అలంకరించిన ఊయలలో అమ్మవార్లను ఉంచి పూలంకి సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ముగ్గురమ్మలను ఆలయంలోనికి తీసుకెళ్లారు.



అమ్మవార్లకు ఊయలసేవ నిర్వహిస్తున్న భక్తులు

అందరికీ కృతజ్ఞతలు..

ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పాతూరి లోకేశ్వరి, చైర్మన్ బోయిన భాను ప్రదీప్‌లు మాట్లాడుతూ ఉత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన ప్రసాదంపాడు, రామవరప్పాడు గ్రామ పెద్దలకు, పోలీసులు, ఆరోగ్య, గ్రామ పంచాయతీ సిబ్బందికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా శుక్రవారం ఆలయంలో భారీ అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



రైవస్ కాలువలో కనుల పండువగా నిర్వహిస్తున్న తెప్పోత్సవం

కానుకల్లో రామవరప్పాడు టాప్

రామవరప్పాడు: సంక్రాంతి ఉత్సవాల సందర్భంగా భక్తులు కానుకల రూపంలో శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మకు సమర్పించిన ఆదాయంలో రామవరప్పాడు టాప్‌లో నిలిచింది. ఆలయ ప్రాంగణంలో గురువారం గ్రామోత్సవం విరాళాలు లెక్కించారు. ఏటా రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల మధ్య అమ్మవారికి సమర్పించిన కానుకల్లో పోటీ నెలకుంటోంది. ఈ సారి రామవరప్పాడులో మొత్తం రూ. 8,85,671 కానుకల రూపంలో రాగా, ప్రసాదంపాడులో రూ. 4,95,413 ఆదాయం వచ్చింది. రామవరప్పాడు ప్రసాదంపాడు కలిపి రూ. 13,81,084 వచ్చినట్లు ఆలయ ఈఓ లోకేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నియంత్రణకు నడుంబిగిద్దాం

జిల్లా టీబీ నియంత్రణాధికారి అంబటి వెంకట్రావు

గన్నవరం: క్షయ వ్యాధి నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని జిల్లా టీబీ నియంత్రణాధికారి అంబటి వెంకట్రావు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో గురువారం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా పద్మజా లేబొరేటరీస్ చైర్మన్ టి. పూర్ణచంద్రరావు ఆర్థిక సౌజన్యంతో 100 మంది క్షయ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో క్షయ వ్యాధిగ్రస్తులు(నిక్షయ మిత్ర)ను గుర్తిస్తున్నట్లు చెప్పారు. నిక్షయ మిత్రలుగా చేరి టీబీ మందులు వాడుతున్న వారికి ఆరు నెలలు పాటు పౌష్టికాహారం అందించేందుకు ముందుకువచ్చిన పూర్ణచంద్రరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంటటీసీ డాక్టర్ వేణుగోపాల్, సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శారమ్మ, ఎంపీహెచ్ఎస్ సాంబశివరావు, టీబీ సూపర్‌వైజర్ రఘు తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారం అందజేస్తున్న అధికారులు, దాత

నేడు డయల్ యువర్ డీఎం

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ పి. శివాజీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డిపో నుంచి నడుపుతున్న బస్ సర్వీస్‌లకు సంబంధించిన విలువైన సూచలు, సలహాలు, సమస్యలను ప్రయాణికులు 8790996090 నంబర్‌కు ఫోన్‌చేసి తెలియజేయాలని కోరారు. ఈ అవకాశాన్ని ఆర్టీసీ డిపో పరిధిలోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎం తెలిపారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి బాసట



బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తున్న ఆదర్శకుమార్, కలపాల ప్రకాష్

కంకిపాడు: అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి బాసటగా నిలుస్తామని వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్, మారేడుమాక సర్పంచ్ సిహెచ్.ఆదర్శకుమార్ అన్నారు. మారేడుమాక గ్రామంలో విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా రేకులషెడ్డు అగ్ని ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. బాధితురాలు గుంటకాని దివ్య కుటుంబాన్ని కలపాల ప్రకాష్, ఆదర్శకుమార్, గొడవర్రు, తెన్నేరు సర్పంచ్‌లు మేరుగు విజయ చంద్రశేఖర్, జుజ్జవరపు ఎలీషా, వైఎస్సార్ సీపీ నేత లాం సురేష్ గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి నిత్యావసరాలను అందజేశారు. ప్రభుత్వం నుంచి రూ.5 వేల ఆర్థిక సాయం, తహసీల్దార్ టి.వి.సతీష్ చొరవతో రెడ్ క్రాస్ నుంచి సామగ్రి, బియ్యం అందించారు. రేకుల షెడ్డును పునర్నిర్మాణం చేసి అప్పగిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ సురేష్, దేవరపల్లి వందనం, స్థానికులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రమాణాలతో విద్యాబోధన జరగాలి

గన్నవరం రూరల్: ఉత్తమ విద్యా ప్రమాణాలతో బోధన జరగాలని ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా రాష్ట్ర పరిశీలకుడు, ప్రత్యేక అధికారి సాయిరాం అన్నారు. గురువారం మండలంలోని గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్‌ను ఆయన సందర్శించి పాఠశాలలో అమలవుతున్న బోధన, జగనన్న గోరుముద్ద, నాడు-నేడు పనుల అమలు, టీచర్స్ డైరీ, లెసెన్ ప్లాన్‌లు పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడుతూ ఉత్తమంగా చదవాలని చెప్పారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రభుత్వం అన్ని వనరులు, వసతులను అందుబాటులో ఉంచిందన్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ సీ, డీ గ్రేడుల్లో ఉన్న విద్యార్థులకు ప్రత్యేకంగా తరగతులు నిర్వహించి వారిలో పఠనాసక్తి పెంచాలన్నారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న జగనన్న గోరుముద్ద మెనూను పరిశీలించారు. 10వ తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని హెచ్‌ఎం కేఎస్ జగదీశ్వరరావుకు సూచించారు. సమగ్ర శిక్ష ఏఎంవో ఆర్.శ్యాం సుందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న పరిశీలకులు సాయిరాం, పాల్గొన్న హెచ్‌ఎం జగదీశ్వరరావు

అక్రమ లేఅవుట్లపై సీఆర్‌డీఏ కొరడా

అంబాపురం(విజయవాడరూరల్): మండలంలో అక్రమంగా వేసిన లేఅవుట్లు, అక్రమ కట్టడాల పై సీఆర్‌డీఏ అధికారులు రెండు రోజులుగా కొరడా ఝులిపిస్తున్నారు. వ్యవసాయ భూములను ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రోడ్లు నిర్మించి ప్లాట్లుగా విడగొట్టి అమాయక ప్రజలకు విక్రయించడం వల్ల ప్రభుత్వాదాయానికి భారీగా గండిపడతోందని సీఆర్‌డీఏ ఏడీఎం మధుసూదనరావు తెలిపారు. గురువారం అంబాపురం గ్రామంలో నేషనల్ హైవేకి దక్షిణం వైపున ఉన్న వ్యవసాయ భూముల్లో వేసిన అక్రమ లేఅవుట్లను గుర్తించి వాటిని ధ్వంసం చేశారు. సర్వే నంబర్లు 67/2,67/2-35, 31, 30ల్లో వేసిన రోడ్లను పొక్లయినర్‌తో ధ్వంసం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజులు చెల్లించినట్టయితే తొలగింపు చర్యలను నిలుపుదల చేస్తామని చెప్పారు.



అంబాపురం గ్రామంలో అక్రమ లేఅవుట్లను ధ్వంసం చేస్తున్న సీఆర్‌డీఏ అధికారులు

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

కంకిపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై కంకిపాడు పోలీసుస్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కోలవెన్ను గ్రామానికి చెందిన పెనుమత్స ఏసోబు (39) విజయవాడలోని చికెన్ షాపులో పనిచేస్తుంటాడు. ఈ నెల 18వ తేదీ రాత్రి తన భార్య జ్యోతితో కలిసి ద్విచక్రవాహనంపై పచారీ సరుకులు కోసం కంకిపాడు వస్తుండగా ఉయ్యూరు వైపు వెళ్తున్న బైక్ వేగంగా వచ్చి వారిని ఢీకొంది. ఈ ఘటనలో ఏసోబు, జ్యోతి గాయపడ్డారు. 108 సిబ్బంది వారిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఏసోబు పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు సన్నీ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

జిల్లాను రోడ్డు ప్రమాదాల రహితంగా తీర్చిదిద్దాలి

విజయవాడ ఉప రవాణా కమిషనర్ ఎం. పురేంద్ర

గన్నవరం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని విజయవాడ ఉప రవాణా కమిషనర్ ఎం. పురేంద్ర సూచించారు. స్థానిక రవాణా శాఖ ఎఫ్‌సీ స్టేషన్‌లో గురువారం 34వ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా లారీ, ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువ శాతం మానవ తప్పిదాలు కారణంగానే జరుగుతున్నాయని చెప్పారు. ప్రమాదాల నివారణకు ప్రతి డ్రైవర్ రోడ్డు సేఫ్టీ నిబంధనలు పాటిస్తూ ఏకాగ్రతతో వాహనాలను నడపాలని తెలిపారు. తద్వారా ప్రమాద రహిత ఎన్టీఆర్ జిల్లాగా మార్చాలని కోరారు. స్టేషన్ ఇన్‌చార్జ్ ఆర్. ప్రవీణ్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. వాహనాల బీమా గురించి ఇండియా ఇన్స్యూరెన్స్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సాంబశివరావు, ప్రమాద సమయాల్లో తీసుకోవాల్సిన వైద్య జాగ్రత్తలు గురించి గన్నవరం సీహెచ్‌సీ వైద్యులు క్రాంతి, శిరీష వివరించారు. ఎంవీఐలు కె. రాంబాబు, కె. వెంకటేశ్వరరావు, డీవీ. రమణ, జీఎస్ఎన్. మూర్తి, ఏఎంవీఐలు శ్రావణి, కె. లాజర్‌బాబు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డీటీసీ

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా నియమాలు అతిక్రమించిన ఆటో డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ వాసా వెంకటేశ్వరరావు హెచ్చరించారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆటోడ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆటోడ్రైవర్లు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, యూనిఫాం ధరించాలని ఎస్‌ఐ వెంకటేశ్వరరావు ఆదేశించారు. హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడళ్ల వద్ద అడ్డగోలుగా ఆటోలు పార్కింగ్ చేయటం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందని, ఇలాంటి ఆటోడ్రైవర్లకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ ఎస్‌ఐ సుందరరావు, ఏఎస్‌ఐ ఎస్.సాయిబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటేశ్వరరావు, పక్కన ఎస్‌ఐ సుందరరావు, ఏఎస్‌ఐ సుందరరావు

పశుసంతతి, ఆర్థిక వృద్ధి లక్ష్యం

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు
- కంకిపాడు మార్కెట్‌యార్డులో పాడి గేదెల పంపిణీకి శ్రీకారం

కంకిపాడు: పశుసంతతి, ప్రజల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ద్వారా డ్వాక్రా సభ్యులకు పాడిగేదెల పంపిణీ కార్యక్రమాన్ని కంకిపాడు మార్కెట్‌యార్డులో గురువారం ఆయన లాంఛనంగా ప్రారంభించి లబ్ధిదారులకు పాడిగేదెలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి అనుబంధంగా పాడి పరిశ్రమపై ఆధారపడ్డ కుటుంబాల ఉన్నతి, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుందన్నారు. గతంలో ఇతర రాష్ట్రాల నుంచి పశువులను తీసుకొచ్చి లబ్ధిదారులకు అందించటం ద్వారా వాతావరణ పరిస్థితులు అనుకూలించక పాడి రైతులకు నష్టాలు కలిగాయన్నారు. ఈ దఫా అలాంటి పరిస్థితులు తలెత్తకుండా స్థానికంగా లభించే మేలుజాతి పశువులను కొనుగోలు చేసి డ్వాక్రా సభ్యులు బ్యాంకుల నుంచి రుణం ఇప్పించి నగదు బదులుగా పాడి పశువులు, గొర్రెలు, మేకలు, పెరటి కోళ్లు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ స్త్రీనిధి, ఉన్నతి, చేయూత స్కీమ్‌ల కింద రూ.75 వేల రుణం అందిస్తున్నామన్నారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో ఫిబ్రవరి నాటికి నాలుగు వేల పాడిగేదెల యూనిట్‌ల స్థాపన లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. పాడి గేదెలు తీసుకున్న లబ్ధిదారులు పాలను జగనన్న పాల వెల్లువ కేంద్రాల్లో విక్రయించుకుని ఆర్థికంగా లాభాన్ని ఆర్జించాలన్నారు. పాడి పశువుల రవాణాను కాంట్రాక్టు సంస్థ ఉచితంగా కల్పిస్తుందన్నారు. పశువైద్యుల ఆరోగ్య నిర్ధారణ అనంతరం లబ్ధిదారులకు పశువులను అందిస్తున్నామని వివరించారు. జిల్లా పశువైద్యాధికారి విద్యాసాగర్ పాడి పశువుల సంరక్షణలో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, పశుసంవర్ధక శాఖ డీడీ జగన్నాథరావు, పలువురు పశువైద్యులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు గేదెలను అందిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

సచివాలయ సేవల్లో ఉయ్యూరు ఫస్ట్

ఉయ్యూరు: సచివాలయ సేవల్లో కృష్ణా జిల్లాలో ఉయ్యూరు ప్రథమంగా నిలిచింది. ఈ నెల ఐదు నుంచి 18వ తేదీ వరకూ జిల్లాలోని 25 మండలాలు, ఐదు మునిసిపాలిటీల పరిధిలో సచివాలయ సేవలపై ప్రగతి నివేదికను ఏపీ సేవ విడుదల చేసింది. జాబితాలో ఉయ్యూరు మండలంలోని 10 సచివాలయాల పరిధిలో 1,529 సేవలు అందించి 153 శాతం సాధించి ప్రథమ స్థానం సాధించింది. రెండో స్థానంలో ఉన్న పెదపారుపూడి మండలం తొమ్మిది సచివాలయాల పరిధిలో 1,051 సేవలను అందించి 117 శాతం సాధించింది. తోట్లవల్లూరు మండలం, ఉయ్యూరు మునిసిపాలిటీ 97 శాతం సరాసరితో మూడో స్థానంలో నిలిచాయి. గుడివాడ అర్బన్ 34 సచివాలయాల్లో 941 సేవలు అందించి 28 శాతం సరాసరితో జిల్లాలో ఆఖరి స్థానంలో నిలిచింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త ఆలోచనతో తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ పల్లెలు, పట్టణాల్లో సత్ఫలితాలనిస్తున్నాయి. గత ప్రభుత్వంలో అందని సేవలు ఈ ప్రభుత్వ హయాంలో ఇంటి ముంగిటకే తీసుకొచ్చి మెరుగైన సేవలు సకాలంలో అందేలా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోంది. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌బుక్‌లు, భూముల సర్వే, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, వివిధ రకాల పథకాల అర్జీలు, రేషన్‌కార్డులు, కరెంటు మీటర్లు, బిల్లులు, వివాహ ధ్రువీకరణపత్రాలు, వంటి ఎన్నో సేవలను ప్రజలు అధికంగా వినియోగించుకుంటున్నారు. మండల, జిల్లా కార్యాలయాల చుట్టూ తిరగకుండానే తమ ప్రాంతం, వార్డులో ఉన్న సచివాలయాల్లో అర్జీ దాఖలు చేస్తే నిర్ణీత గడువులోగా సచివాలయాలు సమస్యకు పరిష్కారం చూపుతున్నాయి.



ఉయ్యూరు మండలంలోని గండిగుంట సచివాలయం

జాతీయ స్థాయిలో విజయ ఫార్మసీ విద్యార్థినుల ప్రతిభ

రామవరప్పాడు: ఎనికేపాడులోని విజయ మహిళ కళాశాల ఫార్మసీ విద్యార్థులను పలువురు ప్రముఖులు అభినందించారు. కర్ణాటకలోని ధారవాడలో నిర్వహించిన జాతీయ యువ దినోత్సవంలో పాల్గొని పలు పోటీల్లో కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా గుణదలలోని సామాజిక సేవా కేంద్రంలో గురువారం ప్రత్యేక సదస్సు నిర్వహించి ఆరుగురు విద్యార్థినులకు సత్కరించారు. ఈ సందర్భంగా ఏపీ గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ రాజ్ విభాగం డైరెక్టర్ జె. మురళీ మాట్లాడుతూ కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో కర్ణాటకలో ఈనెల 12 నుంచి 16వరకు నిర్వహించిన జాతీయ యువ దినోత్సవంలో విద్యార్థులు పాల్గొని, యోగతో పాటు పలు కార్యక్రమాలల్లో ప్రతిభ చూపారన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ సుభాషిణి, ప్రధాన రక్షణ కార్యక్రమ సమీక్ష కమిటీ సీఈవో జి. శ్రీనివాసరావు, మురళీకృష్ణ, డీపీఎం మోహనరావు, నెహ్రూ యువ కేంద్రం సహాయ విభాగపు అధికారి బుర్ర సీతారాం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు ప్రశాంసా పత్రాలు అందజేస్తున్న మురళి, సుభాషిణి తదితరులు

ప్రయాణికుల భద్రతే ప్రథమ కర్తవ్యం

ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

ఉయ్యూరు: ప్రయాణికుల భద్రతే ప్రథమ కర్తవ్యం అని ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు అన్నారు. ఉయ్యూరు ఆర్టీసీ డిపోను ఆయన గురువారం సందర్శించారు. బస్టాండు ప్రాంగణాన్ని పరిశీలించి సేవలపై ఆరా తీశారు. ప్రాంగణంలోని ఖాళీ స్థలాన్ని పరిశీలించి పలు చోట్ల మొక్కలు నాటారు. డిపో పరిధిలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎండీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ఖాళీ స్థలాలను ఆదాయ వనరులుగా మార్చుకోవాలని సూచించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఉయ్యూరు డిపో నుంచి వైజాగ్, హైదరబాద్ బీహెచ్‌ఎల్‌కు లాంగ్ సర్వీసులు వెయ్యాలన్న ప్రతిపాదనపై సమీక్షించి ప్రయాణికులకు ఉపయుక్తంగా నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఈడీలు బ్రహ్మానందరెడ్డి, గిడుగు వెంకటేశ్వరరావు, డీపీటీఓ నాగేశ్వరరావు, డీఎం కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరు డిపోలో మొక్క నాటుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

కానూరులో యువకుడి ఆత్మహత్య

పెనమలూరు: కానూరులో ఓ యువకుడు గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెనమలూరు సీఐ ఆర్. గోవిందరాజు కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లా రణస్థలంనకు చెందిన కె.అప్పలనరసయ్య (35) కానూరు సనత్‌నగర్‌లో కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతను తులసీనగర్‌లో బార్బర్‌షాపులో పని చేస్తాడు. అతని భార్య రామలక్ష్మీ పిల్లలతో సంక్రాంతి పండగకు ఊరు వెళ్లింది. ఈ నేపథ్యంలో భర్త అప్పలనరసయ్య గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. మృతుడి సోదరుడు పైడిరాజు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

22న జాబ్ మేళా

హనుమాన్‌జంక్షన్ రూరల్: నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఈ నెల 22వ తేదీన హనుమాన్‌జంక్షన్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో దాదాపు 35 కంపెనీల ప్రతినిధులు హాజరై నిరుద్యోగ అభ్యర్థులతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, ఎంపికైన వారికి వెంటనే జాయినింగ్ లెటర్లు అందజేస్తామని చెప్పారు. స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జాబ్ మేళా నిర్వహిస్తారని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు తీసుకుని జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు.